నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

● ఎండలతో పెరిగిన విద్యుత్ వినియోగం ● ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్న అధికారులు ● ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ అధికారులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వేసవి సీజన్ మొదలైన నేపథ్యంలో హోరెత్తిస్తున్న ఎండల కారణంగా విద్యుత్ వినియోగం అమాంతం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని ముషీరాబాద్,అంబర్‌పేట, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఎండ వేడిమికి తోడు ఉడకపోత వల్ల విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో సబ్‌స్టేషన్లు ఫీడర్లపై లోడు పెరిగి సరఫరా నిలిచిపోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆయా ఫీడర్ల పరిధిలో నిర్వహణ మరమ్మతులు చేపట్టారు. ముఖ్యంగా అధిక లోడు కారణంగా విద్యుత్ వ్యవస్థ వైఫల్యం చెందకుండా ప్రత్యామ్నాయాలపైన దృష్టి కేంద్రీకరించారు.

వివిధ సెక్షన్ల పరిధిలో....

◆ ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ (డీఈ) పరిధిలోకి అంబర్‌పేట, బర్కత్‌పుర, వీఎస్టీ సబ్ డివిజన్‌లు వస్తాయి. అంబర్‌పేట సబ్ డివిజన్ పరిధిలో అంబర్‌పేట, గోల్నాక, రామాలయం సెక్షన్లు ఉన్నాయి. బర్కత్‌పుర సబ్‌డివిజన్ పరిధిలో కాచిగూడ, బర్కత్‌పుర, విద్యానగర్, శంకర్‌మఠం సెక్షన్లు ఉన్నాయి. వీఎస్టీ సబ్ డివిజన్ పరిధిలో నారాయణగూడ, రాంనగర్, ముషీరాబాద్ సెక్షన్లు కొనసాగుతున్నాయి.


బాగ్‌లింగంపల్లి నారాయణగూడ సబ్‌డివిజన్‌లోని సబ్‌స్టేషన్

చేపట్టిన నిర్వహణ పనులు...

◆ వేసవిలో అధిక విద్యుత్ వినియోగంతో సబ్‌స్టేషన్‌లు, ఫీడర్లపై అధికలోడు పెరిగిన సరఫరాలో అంతరాయం కలగకుండా నిర్వహణ పనులను ఇప్పటికే చేపట్టారు.

◆ అనుకోని పరిస్థితుల్లో సబ్‌స్టేషన్ షట్‌డౌన్ అయితే మరోసబ్ స్టేషన్ నుంచి విద్యుత్‌ను ఇచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం చేస్తున్నారు.

◆ జంపర్‌లు, లైన్‌లు, డీటీఆర్, ఏబీ స్విచ్‌ల మరమ్మతులతో పాటు అవసరమైన చోట్ల కొత్త వాటిని అమర్చుతున్నారు.

◆ అధిక లోడ్‌ను తట్టుకునేలా విద్యుత్ నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్)ల సామార్థ్యం కూడా పెంచుతున్నారు.

◆ లోడును తగ్గించడానికి అదనపు సర్క్యూట్‌లను వేస్తున్నారు.

అంతరాయం లేకుండా..

ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో వేసవి కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించవచ్చు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో ట్రీ కటింగ్‌లను పూర్తి చేశాం.

– డీఈ కమల్‌కుమార్

ఎస్పీడీసీఎల్ డివిజన్ పరిధిలో మూడు నియోజకవర్గాలు (ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్) ఉన్నాయి.

మున్సిపల్ డివిజన్‌లు	12
సబ్‌స్టేషన్‌లు	9
ఫీడర్ల సంఖ్య	71
విద్యుత్ కనెక్షన్లు	1.50 లక్షలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఏడీఈ జి. నాగేశ్వర్‌రావు తెలిపారు. నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో నెహ్రూనగర్, నింబోలిఅడ్డా, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాలలో 2.30 నుంచి 3గంటల వరకు..

◆ చిక్కడపల్లి ఫీడర్ పరిధిలోని ఉమాగార్డెన్, వెంకటేశ్వరస్వామి టెంపుల్, చిక్కడపల్లి, మూన్‌కేఫ్ పీడర్‌పరిధిలో అచ్చయ్యనగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాలలో 3 గంటల నుంచి 3.30 వరకు..

◆ డీడీహెచ్ ఫీడర్ పరిధిలోని నాగమయ్యకుంట, మైసమ్మ టెంపుల్, విద్యానగర్, రాంనగర్ గుండు, ఓమెగా ఆసుపత్రి తదితర ప్రాంతాలలో 4గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయండి



చిక్కడపల్లి: సంజీవయ్యనగర్ బస్తీలో ఇటీవల రూ.3.10 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ పావని అన్నారు. శుక్రవారం ఆమె బస్తీ వాసులతో కలసి పనులను పర్యవేక్షించారు. ఈ పనులతో పాటు పెండిల్‌లో ఉన్న వాటర్‌వర్క్స్ పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్ ముదిరాజ్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, మదన్మోహన్, బస్తీ నాయకులు రమేష్, రాజయ్య, అనిల్, విజయ్, చింటూ, లావణ్య, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నేత రాములు మృతి


రాములు(ఫైల్)

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కుమ్మరి సంఘం చైర్మన్ ఎ.రాములు(80) శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్‌లోని ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుమ్మరి కులస్తుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూస గోరక్‌నాథ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, కుమ్మరి సంఘం అధ్యక్షులు బండారి గోపాల్, ఉపాధ్యక్షులు టిల్లూ, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌లు నివాళులర్పించారు.

మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలి



కాచిగూడ: త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ కులస్తులకు అవకాశం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బర్కత్‌పురలో ముదిరాజ్ సంఘం, బీసీ సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ... ముదిరాజ్‌లకు మంత్రి పదవితో పాటు హోంశాఖను కేటాయిస్తూ డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కోరారు. బీసీ జనాభాలో అత్యధిక జనాభా కల్గిన అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌లకు రాజకీయంగా అవకాశాలు కల్పించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్‌లను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు నీల వెంకటేష్, రామకృష్ణ, ఫణికాంత్, భాస్కర్ ప్రజాపతి, తదితరులు పాల్గొన్నారు.

కావ్య రచనలో తొలి రచయిత్రి మొల్ల

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యంలో కావ్య రచనలో తొలి రచయిత్రి మొల్ల అని విశ్రాంత న్యాయమూర్తి కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభలో 'ఆతుకూరి మొల్ల యాదిలో..'సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో కుమ్మరి కులంలో పుట్టిన మొల్ల స్వయం కృషితో సాహిత్యంలో నాటి కవి పండితులకు సమవుజ్జీగా ఎదిగి రామాయణ మహాకావ్యం రచన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్దనామూర్తి, గాయకుడు త్రినాథరావు, ఆరాధన సంస్థల అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, సభ్యులు శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

కాచిగూడ: ఉరుకుల పరుగుల జీవిత ప్రయాణంలో ఉద్యోగులు ఎప్పటికప్పుడు ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ డాక్టర్ సత్యదీప అన్నారు. జీవశ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఫణిశ్రీ కొంటె ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బర్కత్‌పుర బస్ డిపోలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిపో మేనేజర్ ఆర్. మంజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యదీప మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆరోగ్యంలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉద్యోగులు ప్రతి 3 నెలలకు ఒక్కసారి వైద్యుల వద్దకు వెళ్లి వైద్యుల సూచనలు, సలహాల మేరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్ యాదవ్, మనీష్, ఆర్టీసీ అధికారులు ఎస్‌టీఐ బి.మిథున, ఎంఎఫ్ ఎస్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


బర్కత్‌పుర బస్ డిపోలో ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యదీప

పద్మశాలీలు ఐక్యతతో ముందుకు సాగాలి


పద్మశాలి భవన్‌లో గుజ్జ సత్యంకు జ్ఞాపికను అందజేస్తున్న కందగట్ల స్వామి

కాచిగూడ: పద్మశాలీలు ఐక్యంగా ఉండి రాజ్యాధికారంలో భాగస్వామ్యం పెంచుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. ఐక్యంగా ఉంటే సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయే అనడానికి ఇటీవల ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన పద్మశాలీ మహాసభలే నిదర్శనమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హాజరై పద్మశాలీల ఐక్యతను చూసి చేనేత కార్మికులు, పద్మశాలీలకు వరాల జల్లులు కురిపించారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఈరవర్తి అనిల్ కుమార్ ప్రధాన పాత్రను పోషిస్తూ సీఎం రేవంత్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉండటం వల్లను ఇది సాధ్యమైందన్నారు. శుక్రవారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పద్మశాలి మహాసభల విజయవంతంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, జాతీయ ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, జాతీయ కోశాధికారి కొక్కుల దేవేందర్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటికెలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ప్రభుత్వం ఆరెకటికెలకు రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరెకటికె అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆరెకటికలకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్రంలో 4శాతానికి పైగా తమ జనాభా ఉందన్నారు. 11 కులాలను కలిపి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌ను ఏర్పాటు చేస్తామని గత జూన్‌లో ప్రకటించిందని అయితే ఆ లిస్టులో తమ కులం పేరు లేకపోవడం బాధాకరమని అన్నారు.

◆ బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించినా ఇంత వరకు అసెంబ్లీలో ప్రస్తావించలేదన్నారు. ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మటన్ మార్కెట్‌లు ఏర్పాటు చేస్తానన్నారు. అందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారని ఆయన చెప్పడం అభినందనీయమని అన్నారు. బీసీ–డీలో ఉన్న ఆరెకటికెలను బీసీ–ఏలో కలుపుతూ జీవో జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నగేష్, ప్రధాన కార్యదర్శి నందీశ్వర్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగిన ఆరెకటికెల సమావేశంలో మాట్లాడుతున్న భూంపల్లి అశోక్

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయి



చిక్కడపల్లి: పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సృజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సృజన ఉగాది జీవిత సాఫల్య పురస్కారాలు, ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణకు సృజన జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. అదే విధంగా ప్రముఖ వైద్యుడు అఖిల్ దాడి, ఓఎస్‌డీ శ్రీలక్ష్మి, సీనియర్ జర్నలిస్టులు వల్లీశ్వర్, ఏవీపీ ప్రసాద్, డైటీషియన్ హరితశ్యామ్కు సృజన ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రముఖులు వంశీ రామరాజు, వెంకట్‌రెడ్డి, ఆర్‌వీ రమణలకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

ముషీరాబాద్:అడుగంటి పోతున్న భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భవనాల వద్ద తప్పనిసరి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని జలమండలి కార్యాలయం ప్రాంగణంలో ఇంకుడు గుంత ఏర్పాటు పనులను జలమండలి డీజీఎం మోహన్ రాజ్‌తో కలిసి నవీన్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షపునీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ మాట్లాడుతూ.. జలమండలి ఎండీ ఆదేశాల ప్రకారం భవనాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఇంకుడు గుంతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 300 స్క్వేర్ మీటర్లు గల ఇండ్ల నిర్మాణాలు ఉన్న స్థలంలో తప్పనిసరి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కంచిముదిరాజ్, నాయకులు, జలమండలి సిబ్బందది సాయి, అనిల్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇంకుడు గుంతను ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న వీన్‌గౌడ్, డీజీఎం

42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

కాచిగూడ: బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో పాస్ చేసిన బీసీ బిల్లును వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ.. బీసీ బిల్లు జీవోను విడుదల చేసి వెంటనే గవర్నర్ ఆమోదానికి పంపించాలన్నారు. 42 శాతం పెంచిన బీసీ రిజర్వేషన్లను అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఢిల్లీలో పోరాటం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం బీసీలను మోసం చేయడమే అవుతుందని ఆయన ఆరోపించారు. బిల్లులు పాస్ చేసి అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్‌ల బిల్లుల జీవోలు విడుదల చేసి గవర్నర్ ఆమోదం తీసుకొని అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా బీసీలకు రూ.11వేల కోట్ల బడ్జెట్ కేటాయించారని దానిని రూ.20వేల కోట్లకు పెంచాలన్నారు. బీసీ హాస్టళ్ల, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన కోరారు.

పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలి



బర్కత్‌పుర ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

కాచిగూడ: ఈపీఎస్–95 పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.9వేలు డీఏతో కలిపి చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్లు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. హయ్యర్ పెన్షన్‌పై అభ్యంతరాలు లేకుండా అందరికి అమలు చేయాలన్నారు. ఈపీఎస్–95 పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణం రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.నరహరి, ఎంబీ చారి, నాగేశ్వర్‌రావు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎఫ్‌సీఐ కల్చరల్ ఫెస్ట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) తార్నాక డివిజన్ ఆఫీసు ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇంటర్ డివిజినల్ కల్చరల్ ఫెస్ట్–2025 ప్రారంభమయ్యింది. 7 జిల్లాల ఉద్యోగులతో పాటు ఒక కేంద్ర కార్యాలయం సిబ్బంది ఈ కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వాములు అయ్యారు. నాటికలు, ఏకపాత్రాభినయాలు, నృత్యాలతో పాటు చిన్నచిన్న ఆటలు ఆడి సభికులను ఎంతగానో అలరించారు. ఈ ఫెస్ట్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన డీజీఎం ఎస్‌కే చౌదరి మాట్లాడుతూ... ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం, చైతన్యాన్ని కలిగించడానికి ఈ ఫెస్ట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తాము చేస్తున్న డ్యూటీ, అధికారులతో మాట్లాడే విధానాలు, ఉద్యోగులు ప్రవర్తించే తీరుపై ప్రదర్శించిన నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ తార్నాకా మృత్యుంజయ కుమార్, ఏజీఎంలు గజానంద్, నీరజ్‌కుమార్, డాక్టర్ రాజన్, రామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐ కల్చరల్ ఫెస్ట్‌లో నాటిక ప్రదర్శన

మానవ సేవే మాధవ సేవ


చిక్కడపల్లిలో అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న అడవి నారాయణ, కందూరి కృష్ణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మానవ సేవే మాధవ సేవా అని పేదల ఆకలిని తీర్చడం ఎంతో పుణ్యకార్యంగా భావించాలని ప్రముఖ సామాజిక వేత్త అడవి నారాయణ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 800ల మందికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ... ఎంతో మంది పేదలతోపాటు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఈ అల్పాహార పంపిణీ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కందూరి కృష్ణ, అడ్వొకేట్ కౌశిక్, జ్వాలా వరాలి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్.గోవింద్‌రావు, డాక్టర్ సంగీత్, రిటైర్డ్ ఏసీపీ ఎ. నారాయణగౌడ్, ప్రమోద్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

లింగ సమానత్వం తల్లిదండ్రుల నుంచే మొదలు కావాలి

కవాడిగూడ: పిల్లల పెంపకంలో లింగ సమానత్వంపై అవగాహన తల్లిదండ్రుల నుంచే ప్రారంభం కావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. ప్రతి మహిళా చట్టాలపై అవగహన పెంచుకొని ముందుకు సాగాలన్నారు. శుక్రవారం అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని షెట్టి బలిజ కమ్యూనిటీహాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని ప్రతిభావంతులైన మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ జి. రచనశ్రీ, హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ అమృత హాజరై మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే సముచిత న్యాయం దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్సా కోఆర్డినేటర్ బొట్టు రమేష్, ప్రతినిధులు శ్రావణి, లావణ్య, మల్లిక, ఇందిరా, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎ. ప్రభాకర్ గంగపుత్ర, బండానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఆశావర్కర్ సరస్వతితో పాటు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


కార్పొరేటర్ రచనశ్రీని సన్మానిస్తున్న అప్సా ప్రతినిధులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ట్రాన్స్‌జెండర్లకు క్షమాపణ చెప్పాలి


ట్యాంక్‌బండ్‌పై శ్రీశ్రీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

కవాడిగూడ: ట్రాఫిక్ అసిస్టెంట్స్ ట్రాన్స్‌జెండర్ల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రవర్తించిన తీరును నిరసిస్తూ శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీశ్రీ విగ్రహం వద్ద ట్రాన్స్‌జెండర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అసిస్టెంట్ ట్రాన్స్‌జెండర్ నిషా మాట్లాడుతూ... అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు 50మంది ట్రాన్స్‌జెండర్లను పైలెట్ ప్రాజెక్టుకింద ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా నియమించినట్లు చెప్పే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, పద్మారావుగౌడ్ హేళనగా నవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమను మనుషులుగా గుర్తించి తమపై గౌరవంతో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పుడు గౌరవ ప్రదమైన పనులు చేస్తుంటే అవహేళనగా వ్యవహరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ట్రాన్స్‌జెండర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కాచిగూడ: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈనెల 29వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఆర్.మంజులరెడ్డి తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను, సలహాలు, సూచనలను ఫోన్ నం. 90004 06069లో తెలియజేయాలని కోరారు.

ప్రైవేట్, కార్పొరేట్ వైద్యంపై నియంత్రణ కమిటీ వేయాలి

ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజులపై నియంత్రణ కమిటీని వేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రులపై నియంత్రణ ఉండాలని డిమాండ్‌తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులకు నిధులు కేటాయించి బలోపేతం చేయాలన్నారు. ఫార్మా కంపెనీలు వదులుతున్న రసాయనాలతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఒకప్పుడు రోగం వస్తే క్లినిక్‌కు పోయేవారని ఇప్పుడు ఏ చిన్న జబ్బు వచ్చినా పరీక్షలు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ప్రజలకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి..

◆ కేంద్ర ప్రభుత్వం విద్యా, వైద్యం కోసం అత్యధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు కూలిపోయే ప్రాజెక్టులకు వేలకోట్లు కేటాయించి విద్యా, వైద్య రంగాన్ని గాలికొదిలేశాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు. కార్పొరేట్ వైద్యం ఫీజుల నియంత్రణకు 'ఫీజు రెగ్యులేషన్ కమిటీ'వేయాలని కోరారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. కోదండరాం

ప్రభుత్వ ఆస్పత్రులలో 137 టెస్టులను ఉచితంగా చేస్తున్నాం

◆ హైదరాబాద్ డీఎంహెచ్‌వో జుమ్మిడి వెంకటి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులలో మంచి వైద్యం అందిస్తున్నామని పేర్కొనినారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి సర్వీసును బహిరంగంగా ప్రకటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో 137 టెస్టులను ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీవైఎల్ అధ్యక్షుడు కేఎస్. ప్రదీప్, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు డి.స్వరూప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వి.విజయ్, సీహెచ్ శిరోమణి, ఎం.హన్మేష్, కోట రమేష్, టీయూసీఐ ఉపాధ్యక్షుడు ఎస్ఎల్. పద్మ, ధర్మేంద్ర, ఎస్.అనిల్, ఝాన్సీ, నయనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.